క్లుప్తంగా

ఓంకారంలో భక్తుల రద్దీ



ఓంకారేశ్వరుడు

బండిఆత్మకూరు: మండలంలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలాచరించి ఓంకార సిద్ధేశ్వర స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వ్యాస మహర్షిచే ప్రతిష్ఠించబడిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నల్లమల కొండపై వెలసిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను భక్తులు కాలినడకన వెళ్లి సందర్శించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

కామేశ్వరీదేవికి వెండి కాసులహారం అందజేత



వెండి హారంతో పాటు పట్టువస్త్రాలు అందిస్తున్న దాతలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి ప్రొద్దుటూరుకు చెందిన గంగి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు ఆదివారం 23 గ్రాముల వెండి కాసుల హారం సమర్పించారు. ఈ మేరకు వారు దేవస్థానం కార్యాలయానికి చేరుకుని ఆలయ ఏఈఓ ఎరమల మధు, ముఖ్య అర్చకులు టీవీ రాజమాణిక్యశర్మ, మూలస్థానం సుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో అందజేశారు. వెండి కాసుల హారంతో పాటు రూ.3,500 విలువ చేసే పట్టు చీర అందించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి తెలిపారు. స్వామి వార్ల ప్రసాదాలు అందించి సన్మానించారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం విశాఖపట్నంకు చెందిన బి.పోతురాజు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు పి.దేవికకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానందిలో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: తొలి ఏకాదశి, ఆదివారం సెలవురోజు కావడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లతో పాటు కోదండ రామాలయం, ఆంజనేయస్వామి, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.

చీరల వేలాలు..

శ్రీ కామేశ్వరీదేవికి భక్తులు సమర్పించిన చీరల వేలాల ద్వారా రూ.24వేలు ఆదాయం లభించినట్లు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నాగ మల్లయ్య, జగదీష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద ఆదివారం చీరల వేలాలు నిర్వహించారు.

11న శాకాంబరి దేవి అలంకరణ

ఆత్మకూరు: స్థానిక శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి దేవాలయంలో వెలిసిన పార్వతీమాతకు ఈనెల 11వ తేదీన శాకంబరిదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ పురోహితులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అలంకరణ అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు చేపడతామన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి



మహానందిలో కోలాటం ప్రదర్శనలు



పడమర ప్రాతకోట మోక్షేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు స్నానాలు చేసి వైష్ణ, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి ఉపవాసదీక్షను చేపట్టారు. పలు ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. శివాలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేపట్టారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.

ఆకట్టుకున్న కోలాటం

మహానంది: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మహానందిలో గుంటూరుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కోలాటం, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం గుంటూరు పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి, మహానంది భజన గురువు రాముడు ఆధ్వర్యంలో భక్తిగీతాలకు ప్రదర్శించిన కోలాటం అలరించింది.

- **జూపాడుబంగ్లా:** తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని తర్తూరు, తాటిపాడు, తరిగోపుల, 80బన్నూరు, పి.లింగాపురం, తూడిచెర్ల, పారుమంచాల తదితర గ్రామాల్లోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే తలంటుస్నానమాచరించిన భక్తులు ఆయా గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఏడాదికాలమంతా తమకెలాంటి కష్టాలు వాటిల్లకుండా తమ సుఖసంతోషాలతో గడిచిపోవాలని మొక్కుకున్నారు.
- **పగిడ్యాల:** మండలంలోని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, అర్లపాడు, పాత, కొత్త ముచ్చుమర్రి, కొత్త ఎల్లాల, బీరవోలు, ఆంజనేయనగర్, సంకిరేణిపల్లె, పగిడ్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం,ఎన్. ఘణపురం, రైతుపల్లె, వనుములపాడు తదితర గ్రామాల్లోని ప్రజలు ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దేవాలయాలకు చేరుకుని దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.
- **పాములపాడు:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం తొలిఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. ప్రజలు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు.



తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారికి మహామంగళహారతినిస్తున్న అర్చకుడు

24న ప్రత్యేక సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని కౌండిన్య గౌడ సత్రం నూతన తాత్కాలిక కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటుకు శ్రీశైల దేవస్థానం ఈ నెల 24వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఈఓ ఎం.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంబంధించి దేవస్థాన సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.మురళీ బాలకృష్ణ, పర్యవేక్షకులు ఎం.శ్రీనివాసరావు, సీఎస్‌వో మల్లికార్జున, పర్యవేక్షకులు ఇ.మల్లిక్‌రాజా, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసులుతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 24న ఉదయం 11గంటలకు సత్రంలో తాత్కాలిక కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వెలుగోడు: రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, నేర సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ సురేష్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రోజువారీ పనులు ముగించుకున్న తర్వాత నేరుగా ఇంటికి చేరుకోవాలని అనవసరంగా రోడ్లపైన తిరగవద్దని సూచించారు. ఎవరినైనా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కదలికలపై పోలీసుల నిఘా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు.

బానకచెర్ల నుంచి నీటి విడుదల



నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యేలు బుడ్డా, గిత్తా

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్యలు నీటి విడుదల చేశారు. ముందుగా పూజలు నిర్వహించి నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేశారు. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీసీ ఎస్కేప్‌ఛానల్‌కు వెయ్యి క్యూసెక్కులు, తెలుగుగంగ(వీబీఆర్)కు 5,000 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

అసంపూర్తిగా గేట్ల పునరుద్ధరణ

బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద చేపట్టిన గేట్ల పునరుద్ధరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పీఎస్‌సీ కంపెనీ వారు రూ4.5 కోట్ల నిధులతో 9 గేట్ల పునరుద్ధరణకు పనులు చేపట్టారు. కాగా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఎస్ఆర్‌బీసీ పాత గేట్ల నుంచి కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 1000క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగింది. కార్యక్రమంలో డీఈ నగేష్, ఏఈలు దేవేంద్ర, విశ్వనాథ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు మన్సూర్

నందికొట్కూరు: బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈనెల 8న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నియోజకవర్గంలో విజయవంతంగా చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని చాముండి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్, రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అధ్యక్షతన జరిగే నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి కార్యకర్తలు, నాయకులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఆయా శాఖల అనుబంధ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ జోనల్ ఇన్‌చార్జీ అబూబకర్, ఎస్సీసెల్ తాలూకా అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్ మంగలి కృష్ణ, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు లడ్డు, పట్టణాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ తాలూకా అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కుక్కలకు యాంటీ రెబీస్ టీకాలు

బండిఆత్మకూరు: మండలంలోని పార్నపల్లి గ్రామంలోని పశువైద్యశాలలో పశువైద్యాధికారి జ్యోష్నాదేవి కుక్కలకు రెబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆదివారం జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు రెబీస్ వ్యాధి రాకుండా ముందస్తు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ రెబీస్ వ్యాధి చికిత్స లేని ప్రాణాంతక వ్యాధి అని, దీన్ని నుంచి కాపాడుకోవాలంటే తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కుక్కల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పాములపాడు: వాహన దారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ సురేష్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని వేంపెంట గ్రామంలో ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అలాగే పాములపాడు బస్టాండ్ సెంటరులో వాహనదారులకు సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి గురించి ఆలోచించుకోవాలని, నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి పెట్టొద్దని సూచించారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

నందికొట్కూరు: గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రోడ్లకు కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మిడుతూరు మండల పరిధిలో సున్నంపల్లె గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దేవనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సున్నంపల్లె గ్రామంలో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజీ కాల్వలు, విద్యుత్ స్తంభాల సమస్యలను వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓబులేసు, రామకృష్ణ, స్వాములు, ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొనారు.

బాబూ జగజ్జీవన్‌రాం ఆశయాలను సాధిద్దాం




జగజ్జీవనరాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. జగజ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని ఆదివారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో జరుపుకున్నారు. బస్టాండ్ ఆవరణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆసార్ సయ్యద్ ఇస్మాయిల్, నాయకులు గాలాది వెంకటయ్య, నీరుకట్టు ధనుంజయప్రసాద్,దర్శనం.చిన్నయ్య,నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు

పగిడ్యాల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. ఆదివారం పడమర ప్రాతకోటలో మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ అధ్యక్షతన నిర్వహించిన రెండవ మహాసభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని సిద్ధయ్య హోటల్ నుంచి మోక్షేశ్వర విద్యామందిర్ వరకు ర్యాలీ నిర్వహించి భారత కమ్యూనిస్టు పార్టీ జెండాను ఆవిష్కరించారు. డోన్ పట్టణంలో ఈనెల 30, 31వ తేదిలలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు వి.రఘురాంమూర్తి, రమేష్, విద్యార్థి సంఘం నాయకులు మిద్దె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కాలో కింగ్స్



విజేత జట్టుకు నగదు, షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో కొన్ని రోజులుగా హోరాహోరీగా కొనసాగిన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఆదివారం కాలో కింగ్స్, ఎస్‌బీఎంఎస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. కాలో కింగ్స్ విజేతగా నిలిచింది. తమ మిత్రుడు మల్లికార్జుననాయక్ జ్ఞాపకార్థం కాలో ప్రీమియర్ లీగ్ సీజన్-1 టోర్నమెంట్‌ను వారి మిత్ర బృందం నిర్వహించారు. టోర్నీలో సుమారు 40 జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు నిర్వాహకులు మొదటి బహుమతి రూ.1,35,000, షీల్డ్, రన్నర్స్‌కు రూ.75వేలు, కప్పు, తృతీయ స్థానంలో నిలిచిన ఫియర్‌లెస్ ఫాల్కన్స్ జట్టుకు రూ.40వేలు, కప్పును శ్రీశైలం తెలుగు యూనివర్సిటీ పీఠాధిపతి ముసుగు శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, జనసేన పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు అశోక్, జక్కంపూడి మణికంఠ, అరవింద్ అందజేశారు. నిర్వాహకులుగా మల్లికార్జున నాయక్ మిత్రబృందం వ్యవహరించారు.



శాతనకోటలో పీర్ల స్వాములకు ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



తాటిపాడు పీర్లచావిడి వద్ద చిన్నహుసేనాలం, పెద్దహుసేనాలం పీర్ల ఊరేగింపు

ముగిసిన మొహర్రం వేడుకలు



నెహ్రూనగర్‌లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



సోమయాజుల పల్లెలో జలధిలో పాల్గొన్న ఎస్ఐ జగన్‌మోహన్



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



తాటిపాడులో పీర్లచావిడి వద్ద పీరును ఎత్తుకొని అగ్గిని తొక్కుతున్న దృశ్యం

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, తూర్పు ప్రాతకోట గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారంతో ముగిశాయి. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. మౌలాలి స్వామి, దస్తగిరి స్వామి పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి టెంకాయ, అగరు బత్తీలు, చక్కెర, దారాలు, పూల దట్టీలు, పట్టు దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు సంప్రదాయ రీతిలో విషాద గీతాలు పాడుకుంటూ పీర్లను ఏటికి తరలించారు.

నందికొట్కూరు: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం వేడుకలు ఆదివారం పీర్లు ఏటికి వెళ్లడంతో ముగిశాయి. మండలంలోని శాతనకోట గ్రామంలో కొలువు దీరిన పీర్ల స్వాములకు 3 రోజుల పాటు సరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను జలధి చేసిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి పీర్ల స్వాములను భద్రపరిచారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పెద్దసరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు పూలదండలు, పాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి మండలంలోని తాటిపాడు, మండ్లెం, తంగడంచ, తర్తూరు, జూపాడుబంగ్లా తదితర గ్రామాల్లో కొలువుదీరిన పీర్లలో చిన్న హుసేనాలం, పెద్ద హుసేనాలం పీర్లను పూనకం పూనిన వ్యక్తులు ఎత్తుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని దర్గాల వద్ద పూజలు నిర్వహించి పీర్లచావిడిల ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండాన్ని తొక్కారు.

కొనసాగుతున్న మొహర్రం

ఆత్మకూరు: పట్టణంతో పాటు వడ్లరామాపురం తదితర గ్రామాల్లో ఆదివారం మొహర్రం పూజలు కొనసాగాయి. గ్రామాల్లోని చావిళ్లలో పీర్లకు ప్రత్యేక ఫాతెహాల్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. సోమవారం సాయంత్రం ఊరేగింపుగా ఏటికి తరలిస్తారు.

ముగిసిన మొహర్రం పూజలు

బండిఆత్మకూరు: మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పూజలు వేడుకలు మండల వ్యాప్తంగా ఆదివారం ముగిశాయి. ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా జలధికి తరలించారు. ఎస్ఐ జగన్‌మోహన్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

9న బోనం సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో లోకకల్యాణం కోసం ఈ నెల 9వ తేదీన ఉదయం అషాఢమాస మూలా నక్షత్రం సందర్భంగా శ్రీశైల మహాక్షేత్ర గ్రామ దేవత అయిన అంకాళమ్మ వారికి శ్రీశైల దేవస్థానం తరపున బోనం సమర్పించనున్నారు.

నివాళి

వెలుగోడు: అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన నల్ల కాలువ శంకరమ్మ ఇటీవల అనారోగ్యంతో మతి చెందడంతో ఆదివారం ఆమె చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి నివాళులర్పించారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన శంకరమ్మ సంస్మరణ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

మహానంది: పాల డబ్బాలతో వస్తున్న ఆటో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో చోటు చేసుకుంది. స్థానిక పోలేరమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు తెలిపారు. ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది.

నడిరోడ్డుపై పార్కింగ్... భక్తుల అవస్థలు

మహానంది: క్షేత్రంలోని కొందరు లాడ్జీల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదాయం కోసం భక్తులకు అవస్థలు తెచ్చిపెడుతున్నారు. లాడ్జీల వద్ద పార్కింగ్ స్థలం లేకపోగా నడిరోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయిస్తుండటంతో భక్తులు, ఇతర వాహనదారుల కష్టాలు వర్ణనాతీతం.గాజులపల్లె నుంచి మహానంది వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని పార్వతీపురం వైపు లాడ్జీలు పుట్టుకొస్తున్నాయి.



సమ్మెను విజయవంతం చేయండి

ఆత్మకూరు: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండు వద్ద దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బైకు ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో మున్సిపల్ కార్మికులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆంగ్లేయుల కాలంలో ఎన్నో పోరాటాలు చేసి కార్మికులు హక్కులను సాధించుకున్నారని, అందులో ఫలితంగా 29 కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్‌లను సాధించుకున్నారని చెప్పారు. సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షుడు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహానాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం నాయకులు వీరన్న, మాబాషా, వలీ పాల్గొన్నారు.

సమ్మెకు పీడీఎస్‌యూ మద్దతు


కార్మిక చట్టాలను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న లేబర్ చట్టాల రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా కార్మికులు చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు పీడీఎస్‌యూ మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫిక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పని గంటల విధానం పెంచి కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవరించడం సరికాదన్నారు.

పగిడ్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయంతం చేసేందుకు భారీగా తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన పగిడ్యాలలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్నతో కలిసి దేశ వ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్నా 44 చట్టాలను నాలుగు గోడల మధ్య కుదించి, కార్మికులకు హక్కులు లేకుండా కాలరాస్తోందని మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్ణయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపాలకృష్ణ, వెంకటరాముడు, కురుమన్న, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ఆటో, భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీటీయు జిల్లా నాయకుడు షేక్షావలి, రామకృష్ణ, భాస్కర్ గౌడు, శివకుమార్, సుధాకర్, మౌలాలి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి



యాంపీ థియేటర్‌ను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన పరిధిలోని హటకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయాల వద్ద యాత్రికుల సదుపాయ కేంద్రాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం యాంపీ థియేటర్, గణేశ సదనం, శిఖరేశ్వరాలయం, సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ భక్తుల రద్దీ అధికంగా ఉండే శ్రావణ మాసం, కార్తీకమాసం సమయాల్లో భక్తులను అలరించేందుకు యాంపీ థియేటర్ వద్ద ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని పీఆర్వోను ఆదేశించారు. గణేశ సదనంలో గదుల శుభ్రతపై నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ప్రధాన రహదారి నుంచి శిఖరేశ్వరం వరకు సీసీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. శిఖరేశ్వర ఆలయ మెట్ల మార్గంలో అవసరమైనచోట్ల మరమ్మతులు చేయాలని, పుష్కరిణిలోని పూడిక తీసి శుభ్రంగా ఉంచాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, వసతి, రెవెన్యూ విభాగాల పర్యవేక్షకులు బి.శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.